బితుకు బితుకు



గంగవరం రోడ్డు మలుపు వద్ద దూసుకొస్తున్న భారీ వాహనాలు

గంగవరం రోడ్డులో నిత్యం ప్రమాదాలు

- అతి వేగంగా దూసుకొస్తున్న భారీ వాహనాలు
- భయాందోళనలో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు



గంగవరం రోడ్డులో భారీ వాహనం



తుప్పల్లో పడేసిన స్టాపర్ బోర్డు

పెదగంట్యాడ : గంగవరం రోడ్డులో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. దీంతో గంగవరం రహదారి గుండా ప్రయాణం చేయాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకుంటోంది. పెదగంట్యాడ నుంచి గంగవరం వైపు వెళ్లే రహదారిలో వెంకన్నపాలెం కూడలి వద్ద రోజూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనచోదకులు, పాదచారుల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. ఒక వైపు గంగవరం పోర్టు, ఇంకోవైపు మత్స్యకారులు నివసించే అనేక కాలనీలు, మరోవైపు ఆటో నగర్‌కు చెందిన అనేక పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. అందువల్ల ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, వ్యాపార లావాదేవీలు, ఇతర కూలి పనులు నిమిత్తం గాజువాక వచ్చి వెళ్లే కాలనీవాసులు నిత్యం అదే రహదారి గుండా ప్రయాణం చేస్తూ ఉంటారు. అంతేకాకుండా ఆ కూడలి వద్దకు వెళ్లే వాహనదారులకు ఎవరు ఎటు నుంచి వస్తున్నారో తెలియక గందరగోళ పరిస్థితి నెలకుంటోంది. దీంతో ఒకరినొకరు ఢీ కొనడం, గాయాలపాలవడం షరా మామూలుగా మారిపోయింది. రహదారులకు ఇరువైపులా దట్టమైన ముళ్లపొదలు ఉండడంతో పాటు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఒకరినొకరు తప్పించుకోలేక ఢీకొంటున్నారు. దీనికితోడు గంగవరం పోర్టులో వేలాది మంది ఉద్యోగులతోపాటు వివిధ సరకులు రవాణా చేసే వాహనాలు కూడా అధిక సంఖ్యలో **ప్రయాణం చేయ**డం వల్ల మరిన్ని ప్రమాదాలు **ఎక్కువవుతున్నా**యి. వాహనాల వేగాన్ని నిలు**వరించడానికి,** వాహనదారుడిని అప్రమత్తం **చేసేలా చర్యలు** తీసుకోవాల్సిన అవసరం ఎం**తైనా ఉంది.**

లేకుంటే ఇటువంటి ప్రమాదాలు సం**భవించడం..** తద్వారా ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉందని ఆ ప్రాంతీయులతోపాటు వివిధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి ఇంత ప్రమాదకరంగా ఉన్నా పోలీసులు మాత్రం ప్రమాదాలను అరికట్టేలా చర్యలు చేపట్టడం లేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డులో స్పీడ్ బ్రేకర్స్ ఉన్నా ప్రయోజనం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన స్టాపర్స్ బోర్డులను భారీ వాహనచోదకులు తుప్పల్లో పడేస్తున్నారని చెబుతున్నారు. ఇక్కడ వేగ నియంత్రణ చర్యలు చేపట్టపోవడంతో భారీ వాహనాల వేగానికి అడ్డూ అదుపూ లేకుండాపోతోందని అంటున్నారు, వాహనాల వేగాన్ని నియంత్రించాల్సిన పోలీసులు విధులు కూడా నిర్వర్తించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటుందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

భారీ వాహనాలతో భయం భయం



ఈ రోడ్డులో నిత్యం వేలాదిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా గంగవరం గ్రామస్తులకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాల వేగానికి కళ్లెం వేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఈ రోడ్డులోకి రావాలంటేనే భయమేస్తోంది.

– నొల్లి పోలరాజు, గంగవరం

తరచూ ప్రమాదాలు



మా గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ఇదే రహదారి. ఉదయం వేళల్లో సేఫ్టీటైమ్‌ను ఇక్కడ పాటించడం లేదు. భారీ వాహనాలు 24 గంటలూ దూసుకొస్తున్నాయి. ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో వాహనాలు రాకుండా నిబంధన ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేదు.

– పేర్ల అమ్మోరు, గంగవరం

దేశ అభివృద్ధికి దోహదపడాలి



మాట్లాడుతున్న ఆచార్య అజిత్ కుమార్

అగనంపూడి : భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడడానికి విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు తీసుకెళ్లాలని లైఫ్ టీచర్ వ్యవస్థాపకులు ఆచార్య అజిత్‌కుమార్ సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో వికసిత్ భారత్ – ఇన్నోవేటివ్ ఇండియా కార్యక్రమంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత, విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో దేశం దశదిశలను మార్చగలరన్నారు. మరో రెండు దశాబ్దాల్లో భారతదేశాన్ని ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలపడానికి భారతీయ పౌరులు సహకరించాలన్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని చాటిచెప్పుకునేలా ఎదగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నత ఆలోచనలు, భావాలు, ఆశయాలతో ముందుకు సాగితే దేశం ప్రగతిపథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో డీన్ అర్చన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

గాజువాక : ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా కొత్త పైప్‌లైన్ నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 72వ వార్డు వుడా కాలనీ వినాయకనగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టనున్న పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వార్డుల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, ఏఈ కేదార్‌నాథ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15న మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేంద్ర, మధు తదితరులు

పెదగంట్యాడ : ఇండియన్ నేవీ డేను పురస్కరించుకుని ఈ నెల 15న ఏఎస్‌ఆర్ హెల్పింగ్ హేండ్స్ ఆధ్వర్యంలో బీసీ రోడ్డు మార్వెల్ స్కూల్ వెనుక మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని ట్రస్ట్ ఫౌండర్ ఎ.నరేంద్ర తెలిపారు. ఈ మేరకు నెహ్రూనగర్ జంక్షన్‌లో గురువారం గ్రామ కమిటీ అధ్యక్షుడు శరగడం మధు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కనీసం కొంత మంది ప్రాణాలైనా కాపాడాలని శిబిరంలో వెయ్యి మందితో రక్తదానం చేయించాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని, అందరూ సహకరించి పెద్ద సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మనోజ్, ఆర్‌పీ నాయుడు, గురునాథ్‌రెడ్డి, భరత్‌కుమార్, రంజిత్, సునీల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుని సన్నిధిలో ఎమ్మెల్యే పల్లా



షిర్డీసాయి శాంతిధామంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

పెదగంట్యాడ : స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో సాయినాథుడిని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం దర్శించుకున్నారు. మార్గశిర గురువారాన్ని పురస్కరించుకుని బాబాకు ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లాకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్, మాజీ చైర్మన్ బండి శ్రీనివాస్, నక్క లక్ష్మణరావు, ప్రసాదుల శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిరావాలి

అగనంపూడి : అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ నిర్వహించనున్న పాదయాత్రలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొవాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు కోరారు. విశాఖ జిల్లా పరిషత్ కూడలిలోని కృష్ణ మందిరం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సారథ్యంలో పాదయాత్రగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

రచయిత అజీజ్ కథా సంపుటి ఆవిష్కరణ



అజీజ్ కథా సంపుటి ఆవిష్కరిస్తున్న తటవర్తి త్రినాథరావు తదితరులు

మహారాణిపేట: విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో కర్నూలుకు చెందిన ఎస్.డి.వి. అజీజ్ రచించిన కథా సంపుటి 'అజీజ్ కథలు' పుస్తకావిష్కరణ గురువారం జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు. యుఎస్ఏకు చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త తటవర్తి త్రినాథ నాగేశ్వరరావు కథా సంపుటిని ఆవిష్కరించారు. ఎస్. హనుమంతరావు కథలను సమీక్షించారు. అనంతరం కథా సాహిత్యంపై విభిన్న కోణాల్లో చర్చ జరిగింది. డాక్టర్ డీవీ సూర్యారావు, వి.సిమ్మన్న, మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, అడపా రామకృష్ణ, వి.నాంచారయ్య, బసు పోతన చర్చలో పాల్గొన్నారు. కవులు, రచయితలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక : గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా కేసులను పరిష్కరించేందుకు అందరూ సహకరించాలని 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు కోరారు. గాజువాక కోర్టులలోని పలువురు న్యాయమూర్తులతో కలిసి న్యాయవాదులు, పోలీస్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, భూ తగాదాలు, రెవెన్యూ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు, మోటారు ప్రమాదాల్లో పరిహార ట్రిబ్యునల్, ఇన్సూరెన్స్ కేసులు, విద్యుత్, టెలిఫోన్, యుటిలిటీలతోపాటు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, పెట్టీ కేసులు, మున్సిపల్ వివాదాలు, పెండింగ్ ఉన్న, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తులు కె.కవిత, ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభాకర్, టి.పుల్లయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, కాలనీ ప్రతినిధులు

అగనంపూడి : పర్యావరణ పరిరక్షకులంతా మొక్కలు నాటాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. వార్డులోని గళ్లవానిపాలెం షిర్డీ సాయినగర్ కాలనీలో గురువారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీవాసులు ఇళ్ల ముందు మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. కాలనీలో నాటే మొక్కలకు అవసరమైన ట్రీ గార్డులను కార్పొరేటర్ సమకూర్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాయుడు, రాజు, గొల్లవిల్లి వెంకటరావు, దంతులూరు సుబ్బరాజు, కరణం సత్యారావు, సింగిడి సింహాచలం, గళ్ల రుద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అనూష, లతీష్

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెం గ్రామస్తులు ఎదుర్కొంటున్న గ్రౌండ్ వాటర్, ఎయిర్ పొల్యూషన్ సమస్యలు పరిష్కరించడంతోపాటు మెయిన్ డ్రైన్‌ను నిర్మించాలని కోరుతూ నగర మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ గురువారం వినతిపత్రాలు అందజేశారు. మింది, అక్కిరెడ్డిపాలెం చుట్టుపక్కల ఇండస్ట్రియల్ గొడౌన్స్ నుంచి వెలువడుతున్న కాలుష్యం తీవ్రతను వివరించారు. మింది గ్రామంలో సుమారు 15 ఎకరాలున్న చెరువును అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. వీటితోపాటు వార్డులోని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం పంచవటీని అనుకుని డ్రెయిన్ మీదుగా పోర్టు అథారిటీ వారు నిర్మించతలపెట్టిన గొడౌన్‌ల వల్ల డ్రైనేజీ వ్యవస్థ పాడవకుండా చర్యలు చేపట్టాలని, అక్కడ ముందుగా పక్కా డ్రైనేజీ నిర్మించాలని విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ అడ్వైజరీ టూ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఎస్‌ఐ ఎ.వేణుప్రసాద్‌కు, సీఈలకు వినతిపత్రాన్ని అందజేశారు. మిందిని అనుకుని ఉన్న సన్వారి గ్రూప్ గొడౌన్స్‌లో నిల్వ చేస్తున్న గ్రీన్ పెట్రోలియం కాలుష్యంపై ఆయనకు వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎస్‌ఐ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీని సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన రూల్ ఆఫ్ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేస్తున్నామని హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో గురువారం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తాడన్న, బయ్యే మల్లయ్య ఆధ్వర్యంలో రిజర్వేషన్ పాలసీపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అభ్యున్నతికి యాజమాన్యం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రత్యేక అతిథి, స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎం.మధుసూదనరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. హెచ్‌ఆర్‌డీ విభాగాధిపతి టి.ఎ.ఎస్.ఆర్.టాగూర్ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నైపుణ్యం పెంచుకుని ప్లాంట్ ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ విశ్రాంత హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు, ఎస్టీ లైజన్ ఆఫీసర్ బాబు నాయక్, సెల్ ఆఫీసర్ ప్రసాద్, నాయకులు ఎస్.సత్యనారాయణ, ఎల్.వి.రమణ, కె.వి.రత్నం, మోహన్‌బాబు, పుల్లారావు, బి.డి.నాయక్, గణేష్, అప్పారావు పాల్గొన్నారు.

స్వస్థలానికి ఒడిశా కార్మికుడు



వసతి గృహంలో ఒడిశా వాసి ప్రశాంత్‌కుమార్ నాయక్

సీతమ్మధార: కాంట్రాక్టర్ వేధింపులకు గురైన ఒక కార్మికుడిని ఒడిశా పంపేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఏయూటీడీ ప్రతినిధి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని కటక్‌కు చెందిన ప్రశాంత్ కుమార్ నాయక్ సిమెంట్ పని కోసం వైజాగ్ వచ్చాడు. ఒక చోట పనికి కుదిరాడు. పని చేశాక డబ్బులు అడిగినందుకు కాంట్రాక్టర్ అతన్ని కొట్టి మొబైల్ ఫోన్ తీసుకున్నాడు. చేసేది లేక ప్రశాంత్ కుమార్ నాయక్ ఎంవీపీ కాలనీలో ఉండగా ఆ ప్రాంతంలో నైట్ రౌండ్స్‌లో ఉన్న స్టేషన్ పోలీసు ఐ. అప్పలరాజు ఇతర సిబ్బంది అతని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతన్ని ద్వారకానగర్ టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ–ఏయూటీడీ షెల్టర్‌కు పంపించారు. ప్రశాంత్ కుమార్ నాయక్‌కు జీతం ఇవ్వకుండా, మొబైల్ ఫోన్ తీసుకున్న కాంట్రాక్టర్‌ను పిలిపించి సమస్య పరిష్కరించారు. ప్రశాంత్ కుమార్ నాయక్‌ను అతని ఊరు పంపించే ప్రయత్నం జరుగుతుందని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పెండింగ్ హయ్యర్ పెన్షన్ విడుదల చేయాలి

ఉక్కునగరం : పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెందిన పెండింగ్ హయ్యర్ పెన్షన్ ఉత్తర్వులను విడుదల చేయాలని స్టీల్‌ప్లాంట్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం పెన్షనర్ల బృందం ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పవన్ కుమార్ జాస్తిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. హయ్యర్ పెన్షన్‌పై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. విశాఖ పీఎఫ్ కార్యాలయం 2023లో దాదాపు 2500 మందికి హయ్యర్ పెన్షన్ కోసం డిమాండ్ నోటీసులు పంపిందన్నారు. నోటీసులకు స్పందించిన ఉద్యోగులు రూ.410 కోట్లు పీఎఫ్ కార్యాలయానికి చెల్లింపులు చేశారన్నారు. రెండు, మూడు నెలల్లో పెన్షన్ మంజూరు చేయాల్సి ఉన్నా ఇంత వరకు కనీస పురోగతి లేదన్నారు. పైవారి పరిశీలనలో ఉందని కమిషన్ చెబుతూ నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారన్నారు. ఇటీవల నవంబర్ 24న జరిగిన సెంట్రల్ పీఎఫ్ బోర్డు సమావేశంలో కేంద్ర కార్మిక మంత్రి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారన్నారు. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు లేవన్నారు. పీఎఫ్ ఉన్నత యాజమాన్యం వైఖరికి నిరసనగా ఈ నెల 18న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ రిటైరీస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న హయ్యర్ పెన్షన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద జరుగుతున్న దీక్షా శిబిరంలో మద్దిలపాలెం జోన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం కంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను వీఆర్‌ఎస్ పేరుతో బయటికి నెట్టేయడం జరుగుతుందన్నారు. జీవీఎంసీకి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్ల రూపంలో పన్నులు చెల్లిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయిస్తే ఉత్తరాంధ్ర యువతకి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో సీఐటీయూ సీనియర్ నాయకులు జీవీఎస్ చలపతి, కె. కుమారి, పి. విజయ, సూరప్పుడు, వీఎంఆర్డీఏ కార్మికులు రాంబాబు, నర్సింగ్‌రావు, చిన్నారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తుప్పల్లో స్టీల్‌బెంచీలు

దువ్వాడ రైల్వేస్టేషన్ అధికారుల తీరుపై ప్రయాణికుల మండిపాటు



దువ్వాడ రైల్వేస్టేషన్ పక్కనున్న తుప్పల్లో బెంచీలు



విరగ్గొట్టి మూలకు తోసేసిన స్టీల్ బెంచీ

అగనంపూడి : కొద్దిపాటి మరమ్మతులతో ప్రయాణికులకు ఉపయోగపడే స్టీల్‌బెంచీలు దువ్వాడ రైల్వే స్టేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తుప్పల్లో మూలకు చేరుతున్నాయి.

ఎంపీ నిధులతో, దాతల సహకారంతో దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటి, నాలుగో నంబర్ ప్లాట్ ఫామ్‌లపై ఏర్పాటు చేసిన స్టీల్ బెంచీలు ప్రస్తుతం తుప్పల్లో దర్శనమిస్తున్నాయి. బలంగా ఉన్న స్టీల్‌బెంచీలు ఎందుకు మరమ్మతులకు గురవుతున్నాయో కూడా ఎవరికీ అర్థం కావడం లేదు. బలంగా, మంచి గేజ్‌తో తయారు చేసిన బెంచీలకు ఈ దుస్థితి ఎలా వచ్చిందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై బెంచీలు ఉండడంతో ప్రయాణికులు రైళ్లు ఆలస్యంగా వచ్చినప్పుడు సేద తీరడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అలాంటి వాటిని కాపాడాల్సిన అధికారులు చిన్నపాటి మరమ్మతులకే స్క్రాప్‌గా భావించి తుప్పల్లో మూలన పడేస్తున్నారు. విలువైన బెంచీలను ఇలా నిర్లక్ష్యంగా పడేయడం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

కేంద్రీయ విద్యాలయంలో క్రీడా సంబరాలు



క్రీడలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి సూర్యప్రతాప్



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం -1లో గురువారం 50వ వార్షికోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యాలయ మేనేజ్‌మెంట్ నామినీ చైర్మన్ కమాడోర్ సూర్యప్రతాప్, ప్రిన్సిపాల్ జి.కిషోర్ పాల్గొని క్రీడా వార్షికోత్సవ జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా సూర్యప్రతాప్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి ఉత్సాహం, పోరాట పటిమను పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పోరాట పటిమను ఇనుమడింపజేయడంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా, కరాటే, బనానా రేస్, డ్రిల్ తదితర అంశాలు ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో అండర్–14, అండర్–17లో హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించిన విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.